క్లుప్తంగా

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు



విజ్ఞాన శిబిరానికి హాజరైన విద్యార్థులు

నరసాపురం: వేసవి విజ్ఞాన తరగతులు స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఈ తరగతుల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు పుస్తక సమీక్ష, పుస్తకాలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. చిన్నతనం నుంచే గ్రంథాలయాలకు రావడం, పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ డి.పుష్పరాజ్యం, లైబ్రేరియన్ కేజేఎల్ఎల్ కుమారి, వైఎస్ కళాశాల హెచ్ఆర్డీ సెంటర్ కన్వీనర్ చినిమిల్లి శ్రీనివాస్, పండా నాగేంద్రత్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు లక్ష కుంకుమార్చన



వాసవీ మాతకు పూజ చేస్తున్న దృశ్యం

పెనుగొండ: నగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాతకు లక్ష కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాసవీ మాత జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం నుంచి నగరేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకంలు, అర్చనలు నిర్వహించారు. మహిషాసురమర్దనికి కుంకుమార్చనలు చేశారు. వాసవీ మాతకు ఆలయ ప్రధాన అర్చకుడు కోట వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన వేద మంత్రాలతో నిర్వహించారు. వాసవీ యువ జన సంఘ సభ్యులు భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు.

లయన్స్ జిల్లా ఉత్తమ కార్యదర్శిగా రామారావు



లయన్స్ ఉత్తమ అవార్డు అందుకుంటున్న రామారావు

పాలకొల్లు సెంట్రల్: లయన్స్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ స్థాయిలో జిల్లా ఉత్తమ కేబినెట్ కార్యదర్శిగా పాలకొల్లు పట్టణానికి చెందిన ముత్యాల రామారావు అవార్డు అందుకున్నారు. ఆదివారం రాత్రి స్థానిక అడబాల గార్డెన్స్‌లో జరిగిన లయన్స్ మల్టీపుల్ కన్వెన్షన్‌లో అవార్డుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లాలు, క్లబ్‌ల నుంచి ఉత్తమ సేవలందించిన వారిని గుర్తించి అవార్డులు అందజేశారు. లయన్స్ మల్టీపుల్ కౌన్సిల్ చైర్ పర్సన్ డి.శ్రీకాంతి, జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిల చేతులమీదుగా రామారావు అవార్డు అందుకున్నారు. గత 27 ఏళ్లుగా లయన్స్ క్లబ్‌లో సభ్యునిగా సేవలందిస్తున్న రామారావుకు అవార్డు రావడం పట్ల లయన్స్ సభ్యులు అభినందనలు తెలిపారు.

డీఎన్నార్ కళాశాల వార్షిక పత్రిక విడుదల



కళాశాల వార్షిక పత్రికను విడుదల చేసిన కమిటీ సభ్యులు, ప్రిన్సిపాల్

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణ రావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎక్స్‌ప్రెషన్స్ వార్షిక పత్రికను సోమవారం విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కళాశాల పత్రికను విడుదల చేస్తున్నట్టు చెప్పారు. అధ్యాపకులు, విద్యార్థినుల స్పందనతో కూడిన అంశాలతో వార్షిక పత్రిక ఉంటుందని, దీనివల్ల విద్యార్థినుల్లో ఉన్న సృజనాత్మకశక్తి వెలుగులోకి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ సభ్యులు కొండేటి నారాయణరావు, కొమ్ముల మురళి, జక్కంపూడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా సాగుపై శిక్షణ

ఉండి: ఈ నెల ఆరో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు ఆక్వా సాగులో సాంకేతిక పరిజ్ఞానం, మెలకువలు, మెరుగైన ఆక్వా సాగు విధానాలపై ఫిషరీస్ రీసెర్చ్ స్టేషన్ ఉండిలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌డీవో రాంబాబు సోమవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమాన్ని నాగరాణి ప్రారంభిస్తారని తెలిపారు. ఆసక్తి గల ఆక్వా రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆక్వా సాగులో మెలకువలు సాంకేతిక విధానాన్ని మెరుగుపరుచుకుని ఆక్వాలో మరింత అభివృద్ధి సాధించాలని ఎఫ్‌డీవో కోరారు.

సంచుల కొరత.. రోడ్లపైనే ధాన్యం

- ముందుకు సాగని పట్టుబడి
- వాహనాలు లేక స్తంభించిన ధాన్యం రవాణా



బ్రాహ్మణచెర్వు ఓఎన్‌జీసీ ప్లాంట్ వద్ద నిలిచిన వరి కోతలు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలో ఇప్పటి వరకు దాదాపు 95 శాతం వరి కోతలు పూర్తికాగా, ఇంకా ఐదు శాతం రైతులు మాత్రమే తమ వరి పంట మాసూళ్లు చేయాల్సి ఉంది. ఆదివారం కురిసిన భారీ వర్షంతో మండలంలోని అనేక గ్రామాలలో ధాన్యం రాశులు, పట్టుబడి పట్టిన ధాన్యం బస్తాలు రోడ్లపైనే ఉండటంతో తడిసిముద్దయ్యాయి. రెండు రోజులుగా రవాణాకు కూడా అంతరాయం ఏర్పడింది. ఒక పక్క సంచులు, మరోపక్క వాహనాల కొరత రైతులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

తడిసిన ధాన్యం బస్తాలు

మండలంలో 16 రైతు సేవా కేంద్రాల ద్వారా 33 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉండగా, ఇప్పటి వరకు సుమారు 2400 మంది రైతులకు చెందిన 21 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైసు మిల్లులకు చేరింది. సంచుల కొరతతో సుమారు 6 వేల మెట్రిక్ టన్నుల పైగా ధాన్యం రాశులలో ఉండగా 3 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం బస్తాలలో కట్టి వాహనాలు లేకపోవడంతో రోడ్లపైనే ధాన్యం బస్తాలు దర్శనమిస్తున్నాయి. ఆదివారం కురిసిన వర్షంతో రాశులతో పాటు నెట్టిలు కట్టిన ధాన్యం బస్తాలు కూడా తడిసిపోవడంతో ధాన్యాన్ని రైతులు తిరిగి ఆరబెట్టాల్సివచ్చింది.

తూకాల్లో తేడాతో రైతులకు నష్టం

మండలంలో అతి చిన్నగ్రామాలైన వెలగలవారిపాలెం, సత్యవరం, సోమరాజు ఇల్లిందలపర్రు, భట్లమగుటూరు, జుత్తిగ గ్రామాలలో అత్యధిక మంది రైతులు ఉండగా, ఈ గ్రామాలలోనే ముఖ్యంగా సంచుల కొరత ఏర్పడింది. జుత్తిగ గ్రామంలో ధర్నా చేస్తే గాని సంచులు కదలిరాలేదు. ఈ పరిస్థితిలో అనేక కష్టాలు పడిన రైతులు తమ ధాన్యాన్ని రైస్ మిల్లులకు చేరవేస్తున్నా అక్కడ నాణ్యతా ప్రమాణాలు, తూకాల తేడాతో ధాన్యానికి కోతలు విధించడంతో రైతు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంతజరుగుతున్నా అధికారులు లేదా రాష్ట్ర ప్రభుత్వ పట్టించుకోవడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సరైన కళ్లాలు లేకపోయినప్పటికీ మండలంలో మార్టేరు – పెంటపాడు స్టేట్ హైవే రోడ్డు, లంకలకోడేరు – కానూరు రోడ్డుపై వరి పంట మాసూళ్లు చేసుకుంటున్నారు. అక్కడే ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు.

సంచులు లేక ఇబ్బంది



వరి పంట మాసూళ్లు పూర్తయి నాలుగు రోజుల క్రితం ధాన్యం రాశి పోసి ఉంచాం. భట్లమగుటూరు రైతు సేవా కేంద్రంలో సంచులు కొరత ఉండటంతో రోజూ తిప్పించుకుంటున్నారు. ఇప్పటి వరకు నాకు సంచులు అందలేదు.

– విస్సంశెట్టి చంద్రరావు, కౌలు రైతు, బ్రాహ్మణచెర్వు

రోడ్లపైనే బస్తాలు



ధాన్యం పట్టుబడులు పట్టి వారం రోజులయింది. ఇంకా మరికొంత ధాన్యం ఆరబోసి రాశులు చేశాం. వాహనాలు లేకపోవడంతో ధాన్యం బస్తాలు రోడ్లపైనే ఉంచాం. ఈ రోజు కొంత ధాన్యాన్ని లారీకి ఎగుమతి చేశాం.

– కేవీ సూర్యనారాయణరెడ్డి, రైతు, నత్తారామేశ్వరం



పెనుమంట్ర వద్ద తడిసిన ధాన్యం రోడ్డుపై ఆరబెడుతున్న రైతులు



జుత్తిగ రైతు సేవా కేంద్రం వద్ద సంచుల కోసం గుమికూడిన రైతులు



నత్తారామేశ్వరంలో వారం రోజుల క్రితం పట్టిన ధాన్యాన్ని సోమవారం లారీకి ఎగుమతి చేస్తున్న కూలీలు

8న మండల పరిషత్ సమావేశం

యలమంచిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 8న గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మండలంలో వివిధ శాఖల పరిధిలో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల వివరాలను సభ్యులకు వివరిస్తామని తెలిపారు. రాబోయే మూడు నెలల కాలంలో చేపట్టే పనులపై చర్చిస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఆమె కోరారు.

పోలీసును ఢీకొట్టిన యువకులు

పాలకొల్లుసెంట్రల్: మండలంలోని దిగమర్రు సెంటర్ వద్ద మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు ఓ పోలీసు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో పోలీసుకు గాయాలయ్యాయి. సోమవారం నరసాపురం నుంచి పాలకొల్లు వస్తున్న ఓ కానిస్టేబుల్‌ను వెనుక నుంచి ఇద్దరు యువకులు మద్యం మత్తులో ద్విచక్ర వాహనంపై వస్తూ ఢీకొట్టారు. దీంతో రోడ్డుపై పడిపోయిన కానిస్టేబుల్ తీవ్రమైన నొప్పితో బాధపడ్డారు. స్థానికులు కానిస్టేబుల్‌కు సపర్యలు చేశారు.

రైతుకు పాము కాటు

పెనుగొండ: ఆచంట మండలం పెదమల్లంలో రీసర్వే చేస్తుండగా రైతు ఆదిమూలం మాచిరాజును రక్తపంజరం కాటేసింది. సోమవారం తహసీల్దారు కనకరాజు ఆదేశాల మేరకు గ్రామంలో రెవెన్యూ సిబ్బంది రీ సర్వే చేపట్టారు. మాచిరాజు సర్వే చేస్తుండగా, ఆయన్ని రక్త పంజరం కాటేసింది. దీంతో మాచిరాజు అప్పటికప్పుడు ఆచంట వేమవరం పీహెచ్‌సీ తరలించి వైద్యం చేయించారు. ప్రమాదం తప్పడంతో మెరుగైన వైద్యం కొసం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రభుత్వ వైఫల్యాలను వివరిద్దాం



స్టాలిన్‌బాబును అభినందించిన నాయకులు

యలమంచిలి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మెనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావించి నవరత్నాల పథకాలను అమలు చేశారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు అన్నారు. స్టాలిన్‌బాబు మండల కన్వీనర్‌గా నియమితులైన సందర్భంగా సోమవారం చించినాడ వెళ్లి గ్రామ నాయకులను మర్యాద పూర్వకంగా కలిసి, పార్టీ పటిష్టానికి అవలంభించాల్సిన ప్రణాళికపై చర్చించారు. ప్రజలతో పాటు కూటమి పార్టీలో ఉన్న కార్యకర్తలు కూడా ప్రభుత్వ పాలనపై ఇప్పటికే విసిగిపోయారని, ఆ విషయాన్ని బహిర్గతం చేయాలని స్టాలిన్ సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 11 నెలలు పాలన పూర్తయినా సూపర్ సిక్స్ హామీల్లో సగం కూడా అమలు చేయలేదని, చంద్రబాబు వైఫల్యాలను, మోసాలను ప్రతి కార్యకర్తా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు స్టాలిన్‌బాబును పూలమాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ దంగేటి రాజమణి, ఎంపీటీసీ సభ్యురాలు నల్లి సంధ్యారాణి ఉప సర్పంచ్ రుద్రరాజు చిన్న, నాయకులు రుద్రరాజు చిట్టిరాజు, ముదునూరి రంగరాజు, వీరా ఉమాశంకర్, పోలుకొండ వెంకట్ తదితరులు ఉన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితునికి వితరణ



కిడ్నీ బాధితునికి నగదు అందిస్తున్న పెద్దిరాజు, తదితరులు

పాలకొల్లు సెంట్రల్: సేవ చేయడంలో ఉన్న సంతృప్తి ఎందులోనూ ఉండదని స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల పెద్దిరాజు అన్నారు. సోమవారం పోడూరు మండలం జిన్నూరు పెదపేటలో మనకోసం మనం 7వ వార్షికోత్సవాని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ గత ఏడేళ్లుగా తమ సేవా సంస్థ అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ దాతల సహకారంతో సమష్టిగా ముందుకెళుతోందని చెప్పారు. ఈ సందర్భంగా సేవా సంస్థకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఆర్ మాధవరావు కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కలిశెట్టి కనకారావు, దాసరి సూర్యనారాయణ, సిద్ధార్థ సతివాడ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలపై సవతి తల్లి ప్రేమ



జగనన్న కాలనీలో రోడ్డు దుస్థితిని చూపుతున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: రెక్కడితేడొక్కాడని పేదలుంటున్న జగనన్న కాలనీలపై కూటమి ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతోందని సీపీఎం మండల కార్యదర్శి షేకజ పాదుషా విమర్శించారు. సోమవారం పెనుగొండలోని మునమర్రు రోడ్డు కాలనీలో సీపీఎం నాయకులు పర్యటించి, సమస్యలను పరిశీలించారు. మౌలిక సదుపాయాల కల్పనకు మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు చుట్టూ ప్రదక్షిణలు చేసినా మౌలిక సదుపాయాల కల్పనపై శ్రద్ధ చూపలేదని ఆరోపించారు. కనీసం రాకపోకలకు సైతం అనువుగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్యాస్, రేషన్ డెలివరీలు సైతం రావడం లేదన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

కూలీలకు బీమా తప్పనిసరి



కూలీలతో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ సభ్యులు

నరసాపురం రూరల్: అసంఘటిత రంగంలో పని చేసే వారు శ్రమ్ వెబ్ పోర్టల్‌లో నమోదయితే ప్రమాదాలు జరిగినప్పుడు పరిహారం పొందే వీలుంటుందని ప్యానల్ న్యాయవాదులు డి.నరసింహరాజు, డి.చాంముడేశ్వరి పేర్కొన్నారు. నరసాపురం మండలం సరిపల్లి గ్రామంలో న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో వారు మాట్లాడారు. అసంఘటిత రంగంలోని కార్మికులు ఈ శ్రమ్ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని కార్డు కలిగి ఉండాలని సూచించారు. 14 ఏళ్ల లోపు వయస్సు గల పిల్లలతో కూలి పని చేయిస్తే తల్లిదండ్రులతోపాటు యాజమానికి కార్మిక చట్టం ప్రకారం జరిమాన, శిక్ష విధిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఎం వెంకటలక్ష్మీపతి, పీఎల్‌వీఎం ప్రభాకరరావు పాల్గొన్నారు.

కారల్ మార్క్స్‌కి నివాళులు



ఆచంటలో మార్క్స్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: పెట్టుబడి దారులు సాగిస్తున్న దోపిడికీ వ్యతిరేకంగా కార్మికులు, కష్టజీవులను ఐక్యం చేసిన మహనీయుడు కారల్ మార్క్స్ అని సీపీఎం మండల కార్యదర్శి పి.మోహనరావు అన్నారు. కారల్ మార్క్స్ జయంతిని సోమవారం ఆచంట ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించారు. సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న పేదరికం, దానికి కారణమైన దోపిడీని నిర్మూలించే శాస్త్రీయ శ్రామిక వర్గ సిద్ధాంతం మార్క్సిజం అని వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు ఎస్‌వీఎన్ శర్మ, నాయకులు తోటపల్లి సత్యనారాయణ, తలువూరి బుల్లాబ్బాయి, కుసుమే జయరాజు, బండి రంగారావు, తాళ్ల సురేష్‌లు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆడిటోరియం పనులకు గ్రహణం

- పట్టించుకోని పాలకులు
- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.3.50 కోట్లతో పనులు
- తుది దశలో పనులు నిలుపుదల



నిలిచిపోయిన ఓపెన్ ఆడిటోరియం పనులు

నరసాపురం: ప్రజలు ఏదైనా శుభకార్యక్రమం చేసుకోవాలంటే ప్రైవేటు కల్యాణ మండపాలకు రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీంతో మధ్య తరగతి కుటుంబాలు పడే ఇబ్బందులు అన్నీఇన్నీకావు. వైఎస్సార్ సీపీ హయాంలో నాటి ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కృషితో ఆ సమస్యల పరిష్కారానికి అడుగులు వేశారు. నిరుపయోగంగా ఉన్న నరసాపురం పట్టణంలోని మునిసిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను ఓపెన్ ఆడిటోరియంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. నరసాపురం పరిసర ప్రాంతాల ప్రజలకు నరసాపురంలో తక్కువ అద్దెతో పంక్షన్ హాల్ అందుబాటులోకి రావడమే కాకుండా మున్సిపాలిటీకి కూడా ఆదాయం పెరుగుతుందని భావించారు. అయితే కూటమి సర్కార్ గద్దెనెక్కిన తరువాత సీన్ రివర్స్ అయ్యింది. ఓపెన్ ఆడిటోరియం దాదాపు 90 శాతం పనులు పూర్తయి, పనులు చివరిదశలో ఉండగా ఎన్నికలు రావడం, పనులు నిలిచిపోవడం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక దీని విషయమే పట్టించుకోవడం మానేసింది. మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ స్థానంలో రూ.3.50 కోట్లతో మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియం నిర్మాణ పనులు దాదాపు చివరి దశకు తీసుకొచ్చింది గత జగన్ ప్రభుత్వం. నిరుపయోగంగా ఉన్న పాత భవనాన్ని కూల్చేసి అధునాతన వసతులతో ఓపెన్ ఆడిటోరియం నిర్మాణం చేపట్టారు. మరో 10 శాతం చిన్నపాటి పనులు మిగిలిఉన్నాయి. ఈ పనులు పూర్తయితే పంక్షన్ హాలు అందుబాటులోకి రానుంది.

అప్పుడూ, ఇప్పుడూ అదే తంతు!

అందుబాటులో ఎంతో విలువైన స్థలం ఉన్నా మున్సిపాలిటీలో ఆదాయం పెంచుకునే మార్గంపై గతంలో టీడీపీ హయాంలో ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిపెట్టలేదు. అందుబాటులో ఉన్న విలువైన ఖాళీస్థలంలో ఓపెన్ ఆడిటోరియం నిర్మించాలని ముదునూరి భావించి ముందడుగు వేశారు. మధ్య తరగతి వారికి తక్కువ ఖర్చుతో పంక్షన్లు చేసుకునే వెసులుబాటు కల్పించే యోచన చేశారు. దానిని కొనసాగించలేక ఇప్పుడు కూడా కూటమి సర్కార్ పాత తప్పులే చేస్తుందని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

- డ్రెయిన్లలో సిల్టుతీత పనుల్లో నిర్లక్ష్యం
- నిలదీసిన కౌన్సిలర్లు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ



సమావేశంలో చర్చిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు

నరసాపురం: వేసవి కాలంలో డ్రెయిన్లలో సిల్టు తీయించడం, శుభ్రం చేయించడం వంటి ముఖ్యమైన పనులపై మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడంపై పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని, కౌన్సిలర్లు కేసరి గంగరాజు, వంగా శ్రీకాంత్‌కన్నా, సఖినేటిపల్లి సురేష్, కోటిపల్లి సురేష్‌లు అధికారుల తీరుపై మండిపడ్డారు. డ్రెయిన్లు శుభ్రంచేసే పనులు ఏప్రియల్ నెలలోనే పూర్తి చేయాలన్నారు. ఇప్పుడు కౌన్సిల్ ఆమోదం కోసం పెడితే ఎప్పుడు టెండర్లు పిలుస్తారు? ఎప్పుడు పనులు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. కమిషనర్ వ్యవహారతీరును తప్పుపట్టారు. మున్సిపాలిటీలో ప్రజా సంక్షేమం, ఇబ్బందులను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. దీనిపై చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ మాట్లాడుతూ గతనెలలోనే డ్రెయినేజీ పనులు పూర్తి చేయమని చెప్పినా ఎందుకు ఆలస్యం చేశారని ప్రశ్నించారు. ఇంజినీరింగ్ డీఈ, ఏఈలు ఇచ్చిన సమాధానంపై చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్‌ను తప్పుదోవపట్టించే విధంగా సమాధానాలివ్వడం సరికాదన్నారు. పనితీరు మార్చుకోవాలని సూచించారు. అజండా రూపకల్పనలో తప్పులు దొర్లడంపై కోటిపల్లి సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత ఫార్మెట్‌లో పేర్లు మార్చి అజండాను తయారు చేయడం సరికాదని అన్నారు. సమావేశంలో సభ్యులు వైఎస్, ద్వారా గంగాభవానీ, కావలి రామసీత, మల్లాడి శేషవేణి, సిర్రా కాంతమ్మ, యర్రా లక్ష్మి, పాలూరి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు నాలుగు ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)కు నాలుగు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని సోమవారం చెప్పారు. మండలంలోని రాజులపేటలో ఓల్డ్ వయ్యేరు పంట కాలువపై అనుమతి లేని ఇనుప వంతెనలు, అక్రమ తూరలు వేశారని వాటిని తొలగించాలని ఆ ప్రాంత రైతు జీవీఎస్ఎస్ నారాయణరాజు ఫిర్యాదు చేశారన్నారు. ఇంటి తలుపులు బద్దలు కొట్టి రూ.9 లక్షల నగదు, 45 కాసుల బంగారు ఆభరణాలు 2023 సెప్టెంబర్ 9వ తేదీన దోచుకుపోయారని స్థానిక రైల్వే ఫీడర్ రోడ్డుకు చెందిన కెవీఆర్ బాబు ఫిర్యాదు చేశారని చెప్పారు. స్థానిక 12 వార్డులోని కార్మిక నగర్‌కు చెందిన ఐదుగురు నిరుపేదలు తమ ఇళ్లను అన్యాయంగా తొలగించారని, తమకు ఏ విధమైన పట్టా ఇవ్వలేదని, పట్టా ఇచ్చి, ఇల్లు నిర్మించుకునేందుకు నష్ట పరిహారంగా సొమ్ము ఇవ్వాలని సాలెపు రమణమ్మ, రంగమ్మ, రామాడి లక్ష్మి, పి.సత్యవతి, కె.కాంతమణి ఫిర్యాదు చేశారన్నారు. సిద్ధాపురం గ్రామంలో రోడ్డు మీద రోడ్డు వేస్తున్నారని నాగమునేంద్రరావు ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

'పది' ప్రతిభావంతులకు అవార్డులు



పురస్కారాలు అందుకున్న టెన్త్ విద్యార్థులు

భీమవరం: టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు భీమవరం పట్టణంలోని మానవతాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా అవార్డులు అందించారు. స్థానిక ఆర్యవైశ్య యువ జన సంఘం భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి ముఖ్య అతి థిగా హాజరై మాట్లాడుతూ మానవతా సంస్థ ఆధ్వ ర్యంలో సమాజ సేవా కార్యక్రమాలే కాకుండా గత రెండేళ్లుగా ప్రతిభ కలిగిన టెన్త్ విద్యార్థులకు నగదు అవార్డులు అందిస్తూ ప్రోత్సాహించడం మరింత మందికి స్ఫూర్తినిస్తుందన్నారు. మానవతా విస్తరణ అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకీరామరాజు, సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహన వర్మ మాట్లాడుతూ భీమవరం పట్టణ, మండల స్థాయిలో టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విజేతలకు గుంటూరుకు చెందిన పి.రమాదేవి సహకారంతో నగదు అవార్డులు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందిస్తున్నట్లు చెప్పారు. మానవత సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజు, కో చైర్మన్ కార్మూరి నర్సింహమూర్తి, కోశాధికారి గ్రంధి కుమార వెంకటేశ్వర వర ప్రసాద్, డైరెక్టర్లు ఇందుకూరి ప్రసాదరాజు, వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, వడి వెంకటేశ్వరరావు, కేఎస్ఎస్ఎన్ రాజు, కలిగొట్ల గోపాలశర్మ, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.